

కమలానగర్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కమలానగర్‌లో ఎమ్మెల్యే కాలేరు పాదయాత్ర

గోల్నాక, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్‌లోని కమలానగర్‌లో సోమవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. స్థానికులు తన పాదయాత్రలో తన దృష్టికి తెచ్చిన అన్ని సమస్యలను పరిష్కరించి బస్తీని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే తులసీరాంనగర్ (లంక), న్యూకమలానగర్ తదితర బస్తీలను కూడా అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని ఆయన చెప్పారు. అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలు రెండో సారి భారీ మెజార్టీతో గెలిపించారని ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా పట్టుదలతో పనిచేస్తున్నానని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాకచందర్, శ్రీనివాస్‌రెడ్డి, బక్కయ్య, వి.సంతోష్‌కుమార్, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ స్టేడియంలో పేరుకుపోయిన మట్టికుప్పలు, చెత్తను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు సాయిబాబా, బాల్‌రాజ్‌గౌడ్, తదితరులు

ఎన్టీఆర్ స్టేడియంలో మట్టికుప్పలను తొలగించండి

రాంనగర్/ కవాడిగూడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డున ఉన్న ఎన్టీఆర్ స్టేడియం నిర్వహణలో జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిగా విఫలం చెందారని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా ఆరోపించారు. ఎన్టీఆర్ స్టేడియంలో పేరుకుపోయిన మట్టికుప్పలు, చెత్తను సోమవారం టీడీపీ నేతలతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చ సాంస్కృతిక కార్యక్రమాలకు, క్రీడలకు నిలయంగా మారిన ఈ స్టేడియం నిర్వహణను జీహెచ్ఎంసీ గాలికి వదిలేయడంతో రాత్రి పూట చెత్త, మట్టికుప్పలు, గృహ నిర్మాణ వ్యర్థాలు వేస్తున్నారని ఆరోపించారు. స్టేడియంలో పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శులు నల్లెల కిశోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ఎస్ ప్రకాష్, శ్యాంసుందర్, భాను ప్రకాష్, కిరణ్‌కుమార్, భవాని శ్రీనివాస్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మాహత్యాయత్నం

అడ్డగుట్ట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థాయికి మించి అప్పులు చేశానని, డబ్బులు కావాలని అడగగా తల్లి డబ్బులు ఇవ్వకపోవడంతో చేయి కొరికి మనస్తాపంతో ఆత్మాహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మరణించిన ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన నర్సింగ్ (28) ఆటో డ్రైవర్. పీకల దాక అప్పులు చేయడంతో ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. గత నెల 19న తాను అప్పులు చేశానని, మూడు లక్షలు కావాలని తల్లిని వేధించడంతో తల్లి డబ్బులు ఇవ్వలేదు. ఆగ్రహానికి గురైన కొడుకు తల్లి చేయి కొరికి పారిపోయాడు. ఇంటికి వచ్చిన అనంతరం బాత్‌రూంకు ఉపయోగించే యాసిడ్ తాగి అపస్మారక స్థితిలో పడిపోగా తల్లి గమనించి గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు మార్చురీకి తరలించారు.

కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకురావడం హర్షణీయం

కవాడిగూడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆనాటి బ్రిటీష్ చట్టాలను సవరించి కొత్త చట్టాలు తీసుకురావడం హర్షణీయమని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం నుంచి కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని కేంద్రం ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు. సోమవారం కవాడిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనాడు బ్రిటీష్ వారు తీసుకువచ్చిన చట్టాలనే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా 90 శాతం అమలు చేయడం జరిగిందన్నారు. ఆ చట్టాలను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం కఠిన తరహాైన క్రిమినల్ చట్టాలను రూపొందించి అమలు చేయడం అభినందనీయమన్నారు.

నల్లపోచమ్మ బోనాల పర్యవేక్షకులుగా భూపతి లక్ష్మణ్, రాజేష్



భూపతి లక్ష్మణ్, రాజేష్

గోల్నాక, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గోల్నాక శాంతినగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయం ప్రాంగణంలో జరిగిన శాంతినగర్ నవయువక మండలి సమావేశంలో నల్లపోచమ్మ బోనా ఉత్సవాలను ఈ సారి ఘనంగా నిర్వహించేందుకు పర్యవేక్షకులుగా భూపతి లక్ష్మణ్, ఎం.రాజేష్‌లను ఎన్నుకున్నారు. వీరి పర్యవేక్షణలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేయాలని సమావేశం నిర్ణహించింది. తమపై విశ్వాసంతో బోనాల బాధ్యతను అప్పగించిన కమిటీ పెద్దలకు భూపతి లక్ష్మణ్, రాజేష్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు

● డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి



హెచ్ఎం ఉదయలక్ష్మిని సత్కరిస్తున్న డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి

బర్కత్‌పుర, జూలై 1(ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పనిచేసినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందని హిమాయత్‌నగర్ ఎడ్యుకేషన్ జోన్ డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి అన్నారు. ఉదయ లక్ష్మి మ్యాథ్స్ టీచర్‌గా, ప్రధాన ఉపాధ్యాయులుగా చేసిన సేవలు మరువలేనివని ఆమె కొనియాడారు. సోమవారం బర్కత్‌పురాలోని బూర్గుల రామకృష్ణరావు ప్రభుత్వ ఎయిడెడ్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయురాలుగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఉదయలక్ష్మికి శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ యువతీ మండలి కార్యదర్శులు నివేదిత కుమార్, సరోజిని రెడ్డి, కరస్పాండెంట్ మంజులాదేవి, కోశాధికారి ఆనంద్‌గౌరి, నూతన ప్రధాన ఉపాధ్యాయురాలు తిరుమల జ్యోతి, ఆఫీస్ స్టాఫ్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు రేపు ఉచిత జాబ్‌మేళా

బర్కత్‌పుర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): భారత్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 2, 3 తేదీలలో ఉచిత జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సేవా కేంద్రం డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పిజీ, ఎంబీఏ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలలో పాల్గొన వచ్చునని తెలిపారు. పంజాగుట్టలోని భారత్‌సేవా కేంద్రం కార్యాలయంలో ఉచిత జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 11 నుంచి సాయంత్రం మూడు గంటల వరకు రెండు రోజుల పాటు ఈ జాబ్‌మేళా కొనసాగుతుందని ఆయన చెప్పారు. ప్రైవేట్ సంస్థలలో ఫిమేల్ టెలికాలర్స్, ఎడ్యుకేషన్ కౌన్సిలర్లు, రిసెప్షనిస్టులు. ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ కౌన్సిలర్లు, మార్కెటింగ్ మేనేజర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు 9959363083 నంబర్‌లో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



బర్కత్‌పుర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణచారి తెలిపిన వివరాల ప్రకారం... హుందా నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో 35 ఏళ్ల వయస్సుగల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి శరీరంపై ఎరుపురంగు టీషర్టు, నీలిరంగు ట్రాక్ పాయింట్ ఉంది. ఫొటోను చూసి గుర్తుపట్టిన వారు 8143807592 ఫోన్ నంబర్‌కు వివరాలు తెలపాలని కోరారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో కేక్ కట్ చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ దీప్తి ప్రియాంకా



డాక్టర్లను సన్మానిస్తున్న అంబీ క్లినిక్ ఎండీ, ఫౌండర్ సందీప్

ఘనంగా డాక్టర్స్ డే



నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్

ముషీరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ డాక్టర్స్ డే ను పురస్కరించుకోని ముషీరాబాద్, లంబర్‌పేట నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. భోలక్‌పూర్‌లో ప్రముఖ డాక్టర్ శేఖర్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సేవా భావంతో పనిచేసినప్పుడే ప్రజల్లో ఆదరణ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నియాజ్, ఇర్ఫాన్, సబ్దర్ అలీ, జావేద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో

జాతీయ డాక్టర్స్ డే ను పురస్కరించుకోని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక కేంద్రం (యూపీహెచ్‌సీ) లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ దీప్తి ప్రియాంకా ఆస్పత్రి సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించవద్దని చిన్న పాటి సమస్యలు వచ్చినా వెంటనే సంబంధిత డాక్టర్లను సంప్రదించి వైద్యం చేయించుకోవాలని ప్రముఖ డయాబెటిక్ డాక్టర్ స్వాతి సూచించారు. సోమవారం జాతీయ డాక్టర్స్ డేను పురస్కరించుకోని ముషీరాబాద్‌లోని అంబీ క్లీనిక్‌లో ఆరోగ్యంపై అవగాహన నిర్వహించారు. డాక్టర్ స్వాతి మాట్లాడుతూ..... డాక్టర్ల సలహాలు లేకుండా మెడికల్ షాపుల్లో ఇచ్చే మందులు వాడవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ అందే సౌమ్య, ప్రముఖ డెంటల్ సర్జన్ డాక్టర్ ఎన్ సౌమ్య, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ పూజా సాహరా తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల వైద్యుడికి సన్మానం

చిక్కడపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్స్ డే సందర్భంగా వందేళ్ల వయస్సున్న వైద్యుడిని సన్మానించారు. చిక్కడపల్లిలో నివసిస్తున్న వైద్యులు డా. ఓ ఏ శర్మకు సోమవారంతో వందేళ్లు నిండాయి. ఇదే రోజు జాతీయ వైద్యుల దినోత్సవం కావడంతో జర్నలిస్ట్ జయసూర్య, కవి ఈటల సమ్మన్న, సంఘసేవకులు ఎస్‌బి రామ్, రవీందర్‌లు ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



డా. ఓఏ శర్మను సన్మానిస్తున్న ఈటల సమ్మన్న, జయసూర్య తదితరులు



భోలక్‌పూర్‌లో డాక్టర్ శేఖర్ రెడ్డిని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు అక్లక్ హుస్సేన్ తదితరులు



కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో స్పెషాలిటీ ఆసుపత్రిలో కేక్ కట్ చేస్తున్న ఆస్పత్రి ఎండీ డాక్టర్ రాంరెడ్డి



బీజేపీ నగర కార్యాలయంలో వైద్యులను సత్కరిస్తున్న బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ గౌతమ్‌రావు

నగర గ్రంథాలయం ఎదుట నిరుద్యోగుల నిరసన



నిరసనప్రదర్శన చేస్తున్న నిరుద్యోగులు

చిక్కడపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు ఆందోళన బాటపట్టారు. మెగా డీఎస్సీ, గ్రూప్-2 పోస్టులు రెండువేలు, గ్రూప్-3 పోస్టులు మూడు వేలు పెంచుతూ జీవోలు జారీ చేయాలని కోరుతూ చిక్కడపల్లి హైదరాబాద్ నగర గ్రంథాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి వివక్షతను ప్రదర్శిస్తున్నారని నిరుద్యోగులు ఆరోపించారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు నిరుద్యోగులు మద్దతు ఇచ్చినందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనకు ఎమ్మెల్సీ ఇచ్చిందని గుర్తుచేశారు. రియాజ్ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ అయ్యారన్నారు. తాము ఉద్యమాలు చేసినప్పుడు వెంకట్, రియాజ్ లేరు అన్నారు. పోస్టులు పెంచేవరకు రాజీలేని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితులకు జైలు

రాజేంద్రనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో ఇద్దరు నిందితులకు న్యాయస్థానం ఏడాది జైలు శిక్ష, జరిమానా విధించింది. శంషాబాద్ ఆర్‌జీఐ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల ఈఎస్ఐ డిస్పెన్సరీలో గత ఏడాది సెప్టెంబర్ 28న చోరీ జరిగింది. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు కాటేదాన్ బాబుల్‌రెడ్డినగర్ నివాసి సుమిత్ అలియాస్ సోనుసింగ్(33), సికింద్రాబాద్‌కు చెందిన అహ్మద్ జహంగీర్ మహమ్మద్(39) చోరీ చేసినట్లు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సోమవారం కేసు విచారించిన 12వ అడిషనల్ మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి జేవీఎస్ రాజ్‌కిరణ్ నిందితులకు ఏడాది జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఇరువురి ఘర్షణ.. ఒకరికి కత్తిపోట్లు

రాజేంద్రనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళ్తూ ఒకరికొకరు గుద్దుకోవడంతో జరిగిన ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. లాల్‌దాబా ప్రాంతానికి చెందిన అబ్దుల్ నబీ(40), సల్మాన్ ఆదివారం రాత్రి ఒకే మార్గంలో వెళ్తున్నారు. ఇద్దరూ ఒకరికొకరు గుద్దుకోవడంతో గొడవ జరిగింది. దీంతో సల్మాన్ అబ్దుల్ నబీని కత్తితో పొడిచాడు. బాధితుడు అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆదివారం రాత్రి లాల్‌దాబా ప్రాంతానికి చెందిన మరో యువకుడిని సల్మాన్ గాయపర్చినట్లు తెలిసింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఫలక్‌నుమా ఫారుఖ్‌నగర్‌కు చెందిన దస్తగిరి(52) ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సైదులు

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

● ఇద్దరు దొంగల అరెస్ట్ - గొలుసు స్వాధీనం

బౌద్ధనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు తెంపుకుని పారిపోయిన ఇద్దరు దొంగలను వారాసిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రెండుతులాల బంగారు గొలుసును పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సైదులు, అడ్మిన్ ఎస్సై సుధాకర్‌లు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వారాసిగూడకు చెందిన కె.శారద(71) జూన్ 27వ తేదీ ఉదయం ఏడున్నర గంటల సమయంలో ఇంటిగేటు బయట నిలబడి, కొద్దిసేపటి తర్వాత ఇంట్లోకి వెళ్లుతుండగా ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో రెండు తులాల బంగారు గొలుసుని తెంపుకుని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా నిందితులను మాణికేశ్వరినగర్‌కు చెందిన కూలీలు కొరుదాల శ్రీనివాస్(48), కుంచపు పుల్లయ్య(62)గా గుర్తించారు. సోమవారం ఉదయం మాణికేశ్వరీనగర్‌లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

బాలుడి అదృశ్యం



ఈశ్వర్

బౌద్ధనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌లో వీడియోలు ఎక్కువగా చూస్తున్నాడని తల్లి మందలించటంతో ఓ బాలుడు అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌నగర్ కట్టా ప్రాంతానికి చెందిన ఎస్.భవాని కుమారుడు ఈశ్వర్(14) స్థానికంగా ఓ స్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తల్లి పడుకున్న సమయంలో ఈశ్వర్ సెల్‌ఫోన్‌లో అసభ్యకర వీడియోలు చూస్తున్నాడు. ఈ విషయాన్ని గమనించిన తల్లి కుమారుడిని మందలించింది. దీంతో జూన్ 30వ తేదీ సాయంత్రం 3:30 గంటల సమయంలో ఈశ్వర్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుమారుడి కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో తనకుమారుడు కనిపించటంలేదని సోమవారం సాయంత్రం తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



అఖిల్

తిరుమలగిరి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిపోయానన్న మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బొల్లారం పోలీసుల కథనం ప్రకారం... ఆదర్శ్‌నగర్‌లో నివసించే రవి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. కొన్నేళ్ల క్రితం భార్య చనిపోవడంతో పెద్దకుమారుడైన అఖిల్(18) ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్స్ మెస్‌లో సర్వెంట్ ఉద్యోగం చేస్తూ క్వార్టర్స్‌లో ఉంటున్న నానమ్మ ఊర్మిళ వద్ద ఉంటున్నాడు. 2003లో పదో తరగతి పరీక్షలు రాయగా ఉత్తీర్ణుడు కాలేదు. 2004లో తిరిగి పరీక్షలు రాయగా ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. అప్పటి నుంచి చదువు అబ్బడంలేదని బెంగతో ఉన్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రైల్వేస్టేషన్‌లో గంజాయిని పట్టుకున్న జీఆర్‌పీ పోలీసులు

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి నుంచి 18 కిలోల గంజాయిని సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ జావీద్, సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్‌ల కథనం ప్రకారం... సోమవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నెంబరు 1లో జీఆర్‌పీ ఎస్సై రమేష్‌తో పాటు కానిస్టేబుళ్లు తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదస్థితిలో ఉన్న వ్యక్తి బ్యాగును తనిఖీ చేయగా అందులో 18 కిలోల గంజాయి ఉన్నట్లు జీఆర్‌పీ పోలీసులు కనుగొన్నారు. గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి మహారాష్ట్ర అమీనానగర్ ప్రాంతానికి చెందిన అబుకర్ కాసంషేక్ (47) అని తేలింది. విశాఖపట్నం నుంచి 18కిలలో గంజాయిని కోనుగోలు చేసి మహారాష్ట్రకు తీసుకెళ్లి అధిక ధరలకు విక్రయిస్తున్నాడని విచారణలో తేలింది. నిందితుడి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.



రోడ్డును పరిశీలిస్తున్న ముఠా జైసింహ, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

ముషీరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు శంకుస్థాపనలు చేసిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని బీఆర్ఎస్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ అధికారులను కోరారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్‌లోని వెస్ట్ ఎంసీహెచ్ కాలనీ, జాంబవీ నగర్, వినోభానగర్, మోహన్‌నగర్ ప్రాంతాలలో స్థానికుల ఫిర్యాదు మేరకు జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ముఠా జైసింహ పర్యటించారు. స్థానికుల సమస్యలు తెలుసున్న ముఠా జైసింహ కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని నిత్యం పొంగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

వేంకటేశ్వరాలయ హుండీ ఆదాయం 22.58 లక్షలు

చిక్కడపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.22 లక్షల 58వేల 194 రూపాయలు వచ్చింది. మూడు నెలల హుండీ ఆదాయాన్ని సోమవారం ఆలయంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భ్రమరాంబికా సేవాసమితి సభ్యులు, భక్తులు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఆలయ వ్యవస్థాపక వంశీయుడు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు పర్యవేక్షణలో లెక్కించారు.

రేపటి నుంచి ఆహార కల్తీపై చైతన్య సదస్సులు

చిక్కడపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆహార కల్తీపై చైతన్య సదస్సులు నిర్వహిస్తామని మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి తెలిపారు. సోమవారం ఆయన గోల్కొండ చౌరస్తాలోని మండలి కార్యాలయంలో మాట్లాడుతూ కందిపప్పులో హానికరమైన కల్తీ వల్ల వినియోగదారులు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతున్నారన్నారు. కొందరు వ్యాపారులు చౌకగా దొరికే బత్రి, బటానీ పప్పుకు సింథటిక్ రంగులు వాడి కందిపప్పులో కలుపుతున్నారన్నారు. తాలు మిర్చి పొడికి సింతటిక్ కలర్స్, సుధాన్ వంటి హానికరమైన రంగులు వాడటంవల్ల వినియోగదారులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. అందుకే వినియోగదారులను చైతన్యపర్చడానికి చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

బీసీకి టీపీసీసీ చీఫ్ పదవి ఇవ్వాలి

చిక్కడపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ చీఫ్ పదవిని బీసీకి ఇవ్వాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ అన్నారు. సోమవారం చిక్కడపల్లిలో జరిగిన సమావేశంలో అర్హులైన బీసీకి పీసీసీ అధ్యక్ష పదవినిచ్చి అత్యధిక జనాభా ఉన్న బీసీలను గుర్తించాలన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం పదవుల్లో బీసీలు లేరు కాబట్టి టీపీసీసీ చీఫ్ పదవిని బీసీకివ్వాలని కోరారు. ఈమేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతోపాటు పలువురు కాంగ్రెస్ అగ్రనేతలకు వినతిపత్రాలు పంపామన్నారు. ఐక్యవేదికనేతలు దశరథం, రాజేష్, క్రాంతి, నిఖిల్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



సురేష్‌బాబును అభినందిస్తున్న బస్తీ పెద్దలు

నల్లపోచమ్మ ఆలయ కమిటీ ఎన్నిక

చిక్కడపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని నల్లపోచమ్మ ముత్యాలమ్మ దేవాలయం కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా జాల సురేష్‌బాబు, ఉపాధ్యక్షుడిగా కె.యాదయ్య, నర్సింగ్‌రావు, కోశాధికారిగా కె. సుబ్బారావు, ప్రధానకార్యదర్శిగా ఎ. సంతోష్, యూత్ నాయకులు రమాకాంత్, శివశంకర్, శివ, చిన్నలను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిని బస్తీ పెద్దలు యాదగిరిగౌడ్, చెన్నయ్య బి.వెంకటేష్‌లు అభినందించారు.



మగ్గంవర్క్ శిక్షణాకేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

స్వయం ఉపాధితో ఆర్థికంగా రాణిస్తున్న మహిళలు

చిక్కడపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉచిత శిక్షణా కేంద్రాల్లో శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా, సామాజికంగా గొప్పగా రాణిస్తున్నారని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్, నీవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్ డివిజన్ వీవీ గిరినగర్ కమ్యూనిటీహాల్‌లో కుట్టుతోపాటు నూతనంగా ఉచిత మగ్గం వర్క్ శిక్షణా కేంద్రాన్ని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ పూర్వ గవర్నర్ గంపా నాగేశ్వర రావు, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్‌తో కలిసి కార్పొరేటర్ పావని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరిన్ని వృత్తులలో ముఖ్యంగా బ్యుటీషియన్, కంప్యూటర్ కోర్సుల్లో మహిళలకు ఉచితంగా శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. లయన్స్ క్లబ్ రీజినల్ ఛైర్ పర్సన్ రామయ్యనాయుడు, జోన్ ఛైర్మన్ సుబ్రహ్మణ్యం, గణేష్, చంద్రమోహన్, ప్రకాష్, కమలాకర్, శ్రీనివాస్, మధు, విజయలక్ష్మి, శ్రీకాంత్, ఉమేష్, సురేందర్, ఆనంద్‌రావు, జ్ఞానేష్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తచట్టాలపై పోటీపరీక్షల అభ్యర్థులకు అవగాహన కలిగిస్తున్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య

కొత్త చట్టాలపై పోటీ పరీక్షల అభ్యర్థులకు అవగాహన

చిక్కడపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో నేటినుంచి అమలవుతున్న కొత్త చట్టాలగురించి చిక్కడపల్లిపోలీసులకు పోటీపరీక్షల అభ్యర్థులకు అవగాహన కల్పించారు. సోమవారం ఉదయం అశోక్‌నగర్‌లోని నాగార్జున స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య అవగాహన కలిగించారు. సైబర్ నేరాలు, డ్రగ్ అవేర్‌నెస్, సైబర్‌నేరాల వలలో చిక్కకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, గంజాయి వంటి మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా ఉండాలని వివరించారు. కొత్త చట్టాలు ఎలా ఉంటాయి వంటి వివరాలు సూచనప్రాయంగా వివరించారు. నాగార్జున స్టడీ సర్కిల్ అధినేత నాగార్జున తదితరులు పాల్గొన్నారు.